## ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అవగాహన సదస్సు..

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్‌పామ్ తోటల విస్తీర్ణ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 1425 మంది రైతులకు సంబందించిన 5109 ఎకరాలను ఆయిల్ పామ్ తోటల సాగు నిమిత్తం గుర్తించడం జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 3000 ఎకరాలను సాగు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 521 రైతులకు చెందిన 1901 ఎకరాలలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటడం జరిగింది. ఆయిల్ ఫామ్ రైతులు మొక్కలు నాటిన తరువాత చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నియంత్రణ, సేంద్రీయ, రసాయనిక ఎరువుల మోతాదులపై అవగాహన కల్పించే నిమిత్తం ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, ఫ్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంయుక్తంగా కృషి విజ్ఞాన కేంద్రం మదనాపురంలో రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాష, జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ శాఖ అధికారి కె.సురేష్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు రాజేందర్ రెడ్డి, కెవికె ఉద్యాన శాస్త్రవేత్త కె.సురేష్, బయో ఇమ్యూన్ సినర్జిన్ కంపెనీ ప్రతినిధి విశ్వనాథ్, ఉద్యాన అధజకారులు ఎన్.సురేష్, కె.శ్రీకాంత్, ఆరన.కృష్ణయ్య, ఆయిల్ ఫామ్ ఏరియా మేనేజర్ సుమంత్ రెడ్డి, 100మంది జిల్లా ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు.



ఆయిల్ ఫామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష


# మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## పోడు భూములపై పోరాటం...

- నేడు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా
- డీసీసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

**అచ్చంపేట, నవంబర్29, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు అటవీప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న భూమి రైతులకు దక్కకుండా అధి కారులు లాక్కొని రైతులకు అన్యాయం చేస్తున్నార నే నెపంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు బుధవారం అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాల యం ముందు కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేప ట్టనున్నట్లు డీసీసీ జిల్లాఅధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మె ల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. రాష్ట్రంలో రైతు సమస్యలపై పోరు బాటకై కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, ఈ నెల 21 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు విడతల వారిగా పోడు భూములపై మండల కేంద్రా ల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో, జిల్లా కేంద్రంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయం ముందు పోడు భూములు, ధాన్యం కొనుగోలు, ధరణి, రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు భీమా, వ్యవసాయం, రైతులకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం చేస్తున్నామంటూ రైతులను నట్టేట ముంచుతూ రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించకుండా దళారి వ్యవస్థను రూపొందించి రైతుల పొట్టకొట్టి దళారుల జేబులు నింపేందుకు ప్రయత్నం చేస్తుందని తెలిపారు. పోడు భూములపై పూర్తి హక్కు సాగు చేస్తున్న రైతులకే కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆర్డీఓ కార్యాలయంలో నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.



## 82వ రోజుకు చేరిన..
# గుడిసెల పోరాటం..!

*పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గుడిసెల పోరాటం మంగళవారం 82వ రోజుకు చేరుకుంది. అమరచింత మున్సిపల్ కేంద్రంలో దుంపాయికుంట లో లబ్ధిదారులు ప్రభుత్వ భూమిని చదును చేసుకొని గుడిసెలు వేసుకొని అక్కడే ఉద్యమం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు ఎస్.అజయ్ మాట్లాడుతూ ఇండ్లు లేని పేదలకు ప్రభుత్వం పట్టాలిచ్చి 25 ఏండ్లు గడుస్తున్న స్థలాలు చూపడం లేదని ఆయన అన్నారు. అధికారులకు అనేకమార్లు వినతిపత్రాలు ఇచ్చిన స్పందించలేదని ఆయన అన్నారు. లబ్ధిదారులతో కలిసి పట్టాలు పొందిన వారికి సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో హద్దులు చూపిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్ఎన్ రమేష్, బుచ్చన్న, అనంతమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.*

*అమరచింత, నవంబర్ 29 ప్రభాతవార్త*



గుడిసెలు వేసుకొని పనులు చేసుకుంటున్న లబ్దిదారులు

## అచ్చంపేట అభివృద్ధే ఏకైక లక్ష్యం...

- ప్రతి గుంటకు సాగునీరు అందిస్తాం...
- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, నవంబర్ 29, ప్రభాతవార్త:** అచ్చంపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పర్చేందుకు సీఎం కేసీఆర్ రూ.2500కోట్ల నిధులు కేటాయిస్తున్నారని, దీంతో నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి అచ్చంపేట రాష్ట్రంలోనే అగ్రగామీగా నిలిపేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి గుంటకు సాగునీరు అందించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తానన్నారు. నల్లమల్లలో రిజర్వాయర్లను త్వరలోనే సీఎం కేసీఆర్‌తో శంకుస్థాపన చేయించేందుకు సీఎం హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. పార్టీ పటిష్ట కోసం కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలతో సమన్వయంతో కలిసి పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మహిళా భవనం, కమ్యూనిటీ హెల్త్, క్రీడా ప్రాంగణం తదితర భవనాల ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకొని రావాలని ఆయన సూచించారు. ప్రభుత్వంతో నిధులు మంజూరు చేయించి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసికట్టుగా పనిచేస్తూ దళితబంధు ద్వారా మంజూరయ్యే యూనిట్లను ఎక్కువ మొత్తంలో పదర మండలానికి కల్పించేందుకు సీఎం కేసీఆర్‌తో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## పరస్పర సౌభ్రాతృత్వం, మతపరమైన ఐక్యత భారతదేశానికి ప్రత్యేకతలు...

దర్గా ఖతాలియా కొల్లంపల్లిలో జరిగిన సర్వమత సదస్సులో వక్తల ప్రసంగం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

**నారాయణపేట, నవంబరు 29 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కొల్లంపల్లిలో హజ్రత్ సయ్యద్ అహ్మద్ ఖతాల్ హుసేని 548వ వార్షిక ఉర్సు సందర్భంగా కొల్లంపల్లిలోని అష్రఫియా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 21వ అచల భారత సర్వమత మహాసభలు ఉర్సు వేడుకలను ప్రారంభించారు. మహ్మద్ హుస్సేని సజ్జదా నషీన్ గోగి షరీఫ్, సయ్యద్ షా జలాల్ హుస్సేనీ, అష్రఫీ జలాలీ స్జాజాదా నషీన్‌బర్గా, ఖతాలియా కొల్లంపల్లి అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ..

-మిగతా4లో..

## కొత్త మండలంగా కౌకుంట్ల..!

**హాజరుకానున్న మంత్రి, ఎంపి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే ముందుగా తహసిల్దార్, ఎంఈఓ, ఎంపిఓ కార్యాలయాల ప్రారంభం దేవరకద్రలో బిసి గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రారంభం**



4లో

కొత్త మండలంగా ఏర్పాటు అవుతున్న కౌకుంట్ల

# ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు..

**శాస్త్రవేత్తల జీవిత చరిత్రను తెలుసుకోవాలి:అదనపు కలెక్టర్ మనుచౌదరి, సమాజానికి సైన్స్‌తో అనుబంధం:ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**



నాగర్‌కర్నూల్, నవంబరు 29 ప్రభాతవార్త : విద్యార్థులు శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మనుచౌదరి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనను అదనపు కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఈఓ గోవిందరాజులు ప్రారంభించారు. అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను, విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను అదనపు కలెక్టర్లు మనుచౌదరి, మోతిలాల్, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డిలు తిలకించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ విద్యార్థులను సైంటిస్టుల పేర్లు, వారు కనుగొన్న ఆవిష్కరణ పేర్లు చెప్పమని అడిగారు. ఉత్సాహపరుస్తూ మైకెల్ ఫారడే ఆవిష్కరణలు అతని జీవిత చరిత్ర వివరిస్తూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే సృజనాత్మకత అలవర్చుకుని నూతన ఆవిష్కరణ వైపు తమ దృష్టిని మళ్లించాలన్నారు. శాస్త్రవేత్తల జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తి పొందాలని, సైన్స్ ఫెయిర్‌లో చూసిన అంశాలను తిరిగి పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లను ఉపయోగించుకుని ప్రయోగాలు చేయాలన్నారు. విద్యార్థులు ప్రతి అంశాన్ని ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ప్రతి విషయాన్ని ఉపాధ్యాయుల ద్వారా అడిగి తెలుసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, రాబోయే కాలంలో మంచి సైంటిస్టులుగా ఎదగాలని కోరుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్‌కు సమాజంతో అవినాభావ సంబంధం ఉందని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. వైజ్ఞానిక రంగంలో విద్యార్థులు అత్యంత ఉన్నతస్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయని ఎమ్మెల్యే అభినందించారు. డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ విద్యార్థులు భావి శాస్రతవేత్తలుగా రాణించాలంటే సైన్స్ ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలన్నారు. సైన్స్ ఫేర్‌కు 450 ప్రదర్శనలతో విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ప్రతి అంశాన్ని ప్రదర్శన ద్వారా విద్యార్థులకు వివరిస్తే వాటి ప్రభావం అధికంగా ఉంటుందని గుర్తు చేశారు. సైన్స్ అంటే ఏ ఒక్క విభాగం మాత్రమే కాదని, మౌలిక శాస్త్రాలు, అప్లైడ్ విభాగాలు, టెక్నాలజీ, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం , పశువిజ్ఞానం ఇలా పలు రంగాలలో సైన్స్ విస్తరించి ఉంటుందన్నారు. వాతావరణం, తుఫానులు పసిగట్టడం, ప్రకృతి విపత్తులను ముందుగానే గణించడం, ప్రమాదాలు సంభవిస్తే ప్రాణనష్టాన్ని, ఆస్తి నష్టాన్ని తగ్గించడంపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి సైన్స్ వేదికలపై పాల్గొన్నారని, అందుకు సహకరించిన ఉపాధ్యాయులందరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ హనుమంతరావు, నాగర్‌కర్నూల్ మున్సిపల్ ఛైర్మన్ కల్పనాభాస్కర్‌గౌడ్, వైస్ ఛైర్మన్ బాబురావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న దృశ్యం



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న దృశ్యం



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న దృశ్యం

# మహబూబ్‌నగర్, గద్వాల మధ్య విద్యుద్దీకరణకు పెద్దపీట..!

- విద్యుద్దీకరణను పూర్తి చేసి ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే
- 385 కి.మీ. మేర విద్యుద్దీకరణ పనులు పూర్తి



విద్యుద్దీకరణ పనులు పూర్తి చేసిన దృశ్యం

**మహబూబ్‌నగర్, నవంబరు 29 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే మిషన్ విద్యుదీకరణకు పెద్దపీట వేస్తూ మహబూబ్‌నగర్, గద్వాల మధ్య 72.7 రూట్ కి.మీల దూరం మేర విద్యుదీకరణ పనులను పూర్తి చేసింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 385 రూట్ కి.మీ.లు విద్యుదీకరించబడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరిగిన విద్యుదీకరణ పరంగా భారతీయ రైల్వేలోని అన్ని జోన్‌లలో ఇదే అత్యధికం. ఈ ప్రాజెక్టు 2015,16 సంవత్సరంలో 783 కి.మీ. దూరం మేర విద్యుదీకరణ కోసం రూ.900ల కోట్లఅంచనా వ్యయంతో మంజూరు చేయబడింది. సికింద్రాబాద్, మహబూబ్‌నగర్ మధ్య విద్యుదీకరణ ప్రత్యేక ప్రాజెక్టుగా మంజూరుచేసి పూర్తిచేయబడింది. గద్వాల, రాయిచూర్ విభాగం మధ్య ఇప్పటికే విద్యుదీకరించబడినందున, ప్యాసింజర్, సరుకు రవాణా రైళ్లు ఇప్పుడు హైదరాబాద్, రాయచూర్ అవతలి స్టేషన్‌ల వరకు విద్యుత్ ట్రాక్షన్‌తో సజావుగా ప్రయాణించేందుకు మార్గం సుగమమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విద్యుదీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. చివరి దశలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు దృష్టి సారించారు. దీని ఫలితంగా 2022 ఏప్రిల్ 1 నుండి ఇప్పటివరకు ఈజోన్ 385 రూట్ కి.మీ. విద్యుదీకరణను ప్రారంభించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించబడిన విభాగాలు : వాషిమ్, హింగోలి దక్కన్ 46.3 కి.మీ. కలికిరి తుమ్మనంగుట్ట 49.9 కిమీ. ఖానాపూర్ లాతూర్ రోడ్డు 98.7 కి.మీ., మనోహరాబాద్, కామారెడ్డి 67.3 కి.మీ., ఆరవల్లి, నిడదవోలు 32.8 కి.మీ. భావనపాలెం, సత్తుపల్లి 14.3 కి.మీ., గుత్తి బైపాస్ లైన్ 3.2కి.మీ., మహబూబ్‌నగర్, గద్వాల మధ్య 72.7 కి.మీ మేర విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. రైలు మార్గాల విద్యుదీకరణ వల్ల రైలు ఇంజిన్‌ను మార్చనవసరం లేకుండా ఈ మార్గాల్లో నిరాటంకంగా రైళ్లు సజావుగా నడిచేందుకు వీలు కలుగుతుంది. అలాగే మార్గ మధ్యలో ప్రయాణీకుల రైళ్లు సరుకు రవాణా రైళ్ల నిలుపుదల సమయం తగ్గడం వల్ల రైళ్ల సగటు వేగాన్ని మెరుగుపరుస్తుంది. సెక్షనల్ కెపాసిటి పెంపుదల కారణంగా ఈ విభాగాల్లో మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీనివల్ల రైళ్లు పర్యావరణ అనుకూలమైన విద్యుత్ వినియోగంతో పాటు ఇంధన ఖర్చులను కూడా ఆదా చేస్తుంది. విద్యుద్దీకరణ పనులను అమలు చేయడంలో అంకిత భావంతో సమిష్టిగా కృషి చేసిన ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, సిబ్బందిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభినందించారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ వివిధ విభాగాల్లో ఏకకాలంలో చేపట్టిన ఈ విద్యుద్దీకరణ పనులు శరవేగంగా సాగుతున్నట్లు జనరల్ మేనేజర్ తెలిపారు. ఈ జోన్‌లో విస్తరించి ఉన్న బ్రాడ్‌గేజ్ రైలు మార్గాలను వందశాతం విద్యుదీకరించే దిశగా జోన్ వేగంగా అడుగులు వేస్తోంది.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..

### ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ ఉమర్

**నారాయణపేట,నవంబరు 29 ప్రభాతవార్త :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అందుకే పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహ్మద్ ఉమర్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం నారాయణపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గ్రౌండ్)లో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయగా జూనియర్ సివిల్ జడ్జి పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, చిన్న తప్పువల్ల జీవితం నాశనమైపోతుందన్నారు. విద్యార్థులు ఒకలక్ష్యం పెట్టుకుని చదవాలని మార్కులు తక్కువ వచ్చాయని, పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని క్షణికావేశానికి గురై అఘాయిత్యం చేసుకోవద్దని, మార్కుల కంటే జీవితం ఎంతో గొప్పదని హితవు పలికారు. చదువుతో పాటు సామాజిక స్పృహ కలిగి ఉండాలని సూచించారు. పోక్సోయాక్ట్ గురించి వివరించారు. చదువుతో పాటు ఆరోగ్యం, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని



మాట్లాడుతున్న సివిల్ జడ్జి మొహ్మద్‌ఉమర్


పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సీతారాం, న్యాయవాది రఘువీర్ యాదవ్, హైస్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు యూనిస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేసీఆర్ దీక్షా దివాస్ వల్లే రాష్ట్రం ఏర్పాటు..

**అమరచింత,నవంబర్ 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం దీక్ష దివాస్ వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలంగాణ జాగృతి మక్తల్ నియోజకవర్గం నాయకులు కలాం పాషా అన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష దివాస్ సందర్భంగా మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో డీఎమ్ఆర్ ప్రభుత్వ ప్రాథమిక కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అనేక మంది యువకులు బలిదానాలు చేశారని, అమరుల త్యాగల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ప్రవీణ్ కుమార్, షంషీర్, సర్దార్ అలీ, మహిమూద్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆసుపత్రిలో రోగులకు
పండ్లు పంపిణీ చేస్తున్న జాగృతి నాయకులు

## ప్రాథమిక పాఠశాలకు
## టేబుల్ వితరణ చేసిన కానిస్టేబుల్ బాలరాజు..

**శ్రీరంగాపురం,నవంబర్ 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగరాల ప్రథమిక పాఠశాలకు టేబుల్ వితరణ చేయడం జరిగింది. పూర్వ విద్యార్థి అస్కాని బాలరాజు తండ్రి చంద్రాయుడు సివిల్ కానిస్టేబుల్ ఆయన మంగళవారం ప్రధానోపాధ్యాయులకు టేబుల్ అందజేయడం జరిగింది. అనంతరం ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మా పాఠశాల సిబ్బంది తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియపరుస్తూ భవిష్యత్తులో ఇటువంటి సేవా కార్యక్రమాలు ఇంకా చేపట్టి ఎన్నో మన్ననలను పొందాలని అలాగే పాఠశాలకు అందించిన ఈ సహకారం మరువలేనిదని కొనియాడారు. అస్కని బాలరాజు మాట్లాడుతూ నేను చదువుకున్న పాఠశాలకు టేబుల్ సరఫరా చేయడం నాకు చాలా ఆనందంగా ఉందని భవిష్యత్‌లో విద్యార్థులు మంచి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి హోదాలో ఉండి సమాజ శ్రేయస్సు కొరకు పాటుపడాలని విద్యార్థులను ఆశీర్వదించారు. తెరాస వనపర్తి జిల్లా క్రమశిక్షణ కమిటీ సభ్యులు రాధాకృష్ణ మాఆట్లడుతూ పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకున్నందుకు అస్కాని బాలరాజు కు గ్రామస్తుల నుంచి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటసాయి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు టేబుల్
అందిస్తున్న కానిస్టేబుల్ అస్కని బాలరాజు

## టీఎస్-ఐపాస్ ద్వారా
## సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి..

### జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**వనపర్తి ప్రతినిధి,నవంబర్29 ప్రభాతవార్త:** టీఎస్-ఐ పాస్ ద్వారా సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకొని యువత ఆర్థికాభివృద్ధి పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్ సూచించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ టీఎస్6ఐపాస్ సబ్సిడీ రుణాలపై కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ లకు 4యూనిట్లు టీఎస్‌పీ లకు 6 యూనిట్ల చొప్పున సబ్సిడీ రుణాలను కమిటీ ఆమోదించినట్లు ఆయన వివరించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల యువత ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ యాదగిరి, ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి విజయసారధి, టీఎస్ పీసీబీ సాయి విద్యమని నాయక్, టీఎస్ పీడీసీఎల్ వేణు, డీసీటీఓ నాగేందర్, సీనియర్ అసిస్టెంట్ రామ్‌శేఖర్, డీఏసీసీఓ సోమశేఖర్, డీటీడీఓ దిలీప్ కుమార్, పవన్, ప్రతాప్, రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న
జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

## సీఎం కేసీఆర్ సభకు జన సమీకరణ చేయాలి..

### మండల టీఆర్ఎస్ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య

**ఖిల్లాఘణపురం,నవంబర్ 29 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని మండల టీఆర్ఎస్‌పార్టీ కార్యాలయం ఆవరణలో మంగళవారం టీఆర్ఎస్ నాయకులు ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభకు జనసమీకరణ చేయాలన్నారు. గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పాలు చేస్తున్నా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చొరవతో మండలంలో కృష్ణా జిల్లాలో పారించి పంట సాగును పెంపొందింపజేసినట్లు గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా మారాడని రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డా.వెంకట్‌రమణ, టీఆర్ఎస్ నాయకులు కృష్ణయ్య గౌడ్, విక్రమ్, ఆంజనేయులు గౌడ్, బుచ్చిబాబు గౌడ్, వెంకటేష్, గోపాల్, కృష్ణయ్య, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


టీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

## ఘనంగా సుబ్రమ్మణ్య స్వామి షష్టి వేడుకలు..

**వనపర్తి టౌన్,నవంబర్ 29 ప్రభాతవార్త:** సుబ్రహ్మన్య స్వామి షష్టి వేడుకలు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. రాహు, కేతు, కుజగ్రహ దోష నివారకుడు, భక్తుల కష్టాలు తొలగించే కార్తికేయుడికి కావడి సమర్పిస్తే వివాహం కానీ వారికి వెంటనే వివాహ యోగ్యత, సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి పలుగుతుందని భక్తుల నమ్మకం అందుకే ప్రతి ఏడాది సుబ్రహ్మణ్యస్వామి షష్టి స్వామి వానికి పాల కావడీలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో బాగంగా వనపర్తిలో గతంలో లాగే ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. అయ్యప్ప సేవా సమితి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పాలకావడి వేడుకలు, సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం 7గంటలకు జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణ నుంచి వంద మందికి పైగా భక్తులు పాలకావడీలను భుజానేసుకొని బాజా భజంత్రీలతో ఊరేగింపుగా అయ్యప్ప ఆలయం వరకు చేరుకొని అక్కడ సుబ్రమణ్య స్వామి వారికి పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారి కళ్యాణం వేడుక జరిపించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి, ఆలయ కమిటీ సభ్యులు నగేష్, ముత్తు కృష్ణ గరుస్వామి, అమరవాది నరేందర్, పాపిరెడ్డి, చీర్ల కృష్ణ సాగర్ తో పాటు గురు స్వామి వాకిటి శ్రీధర్, కటకం చంద్రుడు, కూరగాయల రవీందర్, నందిమల్ల అశోక్, బంగారు అనిల్ కుమార్, రఘుమా రెడ్డి, కొమ్ము రాజేష్, ఆలయ అర్చకులు రమష్ర్ శర్మ సిద్దాంతి, తదితరులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్య స్వామి పాలకావడి మోసుకెళ్తున్న స్వాములు

## ఈకేవైసీపై అవగాహన

**వంగూరు, నవంబర్ 29, ప్రభాతవార్త:** మండలంలోని కోనేటి పూర్, పోల్కంపల్లి, కొండారెడ్డి పల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఏ ఈఓలు ఈకేవైసీ పై రైతుల కు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్ నుంచి మంజూరయ్యే రూ.2వేలు రైతు ఖాతాలో జమయ్యేందుకు ఈకేవైసీ తప్పనిసరి అని వారు సూచించారు. ఈకేవైసీ పెట్టని రైతులు సమీప మీ సేవా కేంద్రాల కు వెళ్లి ఈకేవైసీ అప్‌డేట్ చేయించి వ్యవసాయ కార్యాలయంలో అందిస్తే పీఎం కిసాన్ డబ్బులు తమ ఖాతాల్లో జమవుతాయని ఏఓ తనూజరాజ్ తెలిపారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

## బొంతు శ్రీదేవి యాదవ్ జోలికి వస్తే ఖబడ్దార్..

### ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కులహంకారంతో మాట్లాడుతున్నాడు
### బిసి ప్రజాప్రతినిధులపై అగ్రవర్ణ ప్రజాప్రతినిధులు కుట్రలు చేస్తున్నారు
### బిసిసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

**మక్తల్,నవంబరు29 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అగ్రవర్ణ కులానికి చెందిన ఎమ్మెల్యేను కులహంకారంతో నోటికి వచ్చినట్లు బూతులు తిడుతున్నాడని బిసి యాదవ సామాజికి వర్గానికి చెందిన చర్లపల్లి మహిళా కార్పోరేటర్ బింతు శ్రీదేవి యాదవ్‌ను మహిళా కార్పోరేటర్ అని కూడా చూడకుండా కులం పేరుతో దూషించడం ముమ్మాటికి అగ్రవర్ణం కులహకారమేనని బిసిసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. బిసి యాదవ సామానిక వర్గానికి చెందిన మహిళా యాదవ కార్పోరేటర్ రాజకీయంగా అణగదొక్కాలని చూస్తే ఉప్పల్ నియోజకవర్గంలోని బిసిలంతా ఏకమై రాబోయే రోజుల్లోనే బేతి సుభాష్ రెడ్డిని రాజకీయంగా బొందపెడతామన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకు బిసి ప్రజాప్రతినిధులపై అగ్రవర్ణ ప్రజా ప్రతినిధులు పెత్తనం చూపిస్తూ రాజకీయంగా బిసి ప్రజా ప్రతినిధులను ఎదగనీయకుండా కుట్రలు పన్నుతున్నారన్నారు. బిసి ప్రజాప్రతినిధులపై నోటికి వచ్చినట్లు మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసిసేన రాష్ట్ర కార్యదర్శి జెవిరావు, బిసిసేన నారాయణపేట నియోజకవర్గ ఇంఛార్జి బాల్‌రాజ్‌యాదవ్, బిసిసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిసిసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్

## మహిళల హక్కుల సాధనకై ఉద్యమించండి..

### అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి: ఎ.లక్ష్మీ

**వనపర్తి టౌన్,నవంబర్ 29 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చే హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో భారత ప్రజాతంత్ర మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అచలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీ జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా హక్కులను కాల రాస్తున్నారని అన్నారు. ముఖ్యయంగా వనపర్తి జిల్లాలో అభయహస్తం 60 సంవత్సరాలు నిండిన వారికి మహిళా సంఘాలకు పించన్ ఇస్తామని అన్న ప్రభుత్వాలు మహిళా హక్కులను కాలరాస్తుందని అన్నారు.గత ఎనిమిది నెలల కిందట రాష్ట్ర ప్రభుత్వం అభ్యస్త పించన్ ఇస్తామని అన్న ప్రభుత్వం నేటికి అమలు చేయలేదని అన్నారు. అంతేకాకుండా మమిళా సంఘాలకు 25పైసా వడ్డీతో పాటు రుణ సౌకర్యాలు ఇస్తామని ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదు గత ఎనిమిది సంవత్సరాల నుండి తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఎలాంటి రుణ సౌకర్యం కల్పించలేదని అన్నారు. కేంద్రంలో నా ప్రభుత్వం మహిళా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ఆ ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ఆ ప్రభుత్వం విఫలం అయిందని అన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీని అమలు చేయలేదని అన్నారు. నవంబర్ 30 నుండి డిసెంబర్ నెల వరకు వనపర్తి జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు మహిళలకు రక్షణ కల్పించాలని మహిళలకు అన్ని రంగాల్లో అభివృద్ధి దశలు నడపాలని దశల వారీ పోరాటాన్ని నిర్వహిస్తామని వారు అన్నారు.మహిళల హక్కుల కోసం జరుగుతున్న పోరాటానికి ఉన్న అన్ని మండల కేంద్రంల అభయాసం పించన్ దారులతో పాటు 25 పైసల వడ్డీ రుణాలు సౌకర్యం కల్పించాలని నేటి నుంచి ధర్నాలు నిర్వహిస్తున్నామని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా సహాయ కార్యదర్శి సాయిలీల
కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న దృశ్యం

## కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తాం..

### మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి

**అమరచింత,నవంబర్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని పూర్తిగా రద్దు చేస్తామని మక్తల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిర భారత్ జోడో యాత్ర వల్ల కాంగ్రెస్ పార్టీ బలపడిందని ఆయన అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 30న మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నాకు వేలాది గా రైతులు తరలిరావాలని ఆయన రైతులను కోరారు. అలాగే డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో పాదయాత్ర చేపడుతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నా ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉద్యమాలకు సిద్దంగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అమరచింత మండలంలోని కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర వల్లే మస్టీపూర్ క్రాస్ నుండి జూరాల ప్రాజెక్టు వరకు పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఆత్మకూర్ నుండి మరికల్ వరకు బీటీ రోడ్డు అస్థవ్యస్తంగా మారిందని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ముగ్గురు ఎమ్మెల్యే లు రోడ్డుపై తిరుగుతున్న రోడ్డు కనపడడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కార్యకర్తలు సిద్దంగా ఉండాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎస్ఎమ్ అరుణ్ కుమార్, మండల అధ్యక్షులు అమర్, మాజీ ఎంపీటీసీ మహంకాళి విష్ణు, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు విష్ణు యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్యామ్, ప్రకాశం, కాంగ్రెస్, నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న
కాంగ్రెస్ నాయకులు కె.ప్రశాంత్‌కుమార్ రెడ్డి

### జిల్లా సైన్స్ ఫెయిర్ వైజ్ఞానిక
## గణిత ప్రదర్శనను విజయవంతం చేద్దాం
### జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ సిరాజుద్దిన్..

**అయిజ,నవంబరు 29 ప్రభాతవార్త :** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్, వైజ్ఞానిక గణిత పర్యావరణ ప్రదర్శనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి మహ్మద్ సిరాజ్ కోరారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతిసంవత్సరం నిర్వహించే సైన్స్‌ఫేర్, వైజ్ఞానిక పర్యావరణ ప్రదర్శనను ఈసారి అయిజ పట్టణంలో నిర్వహించడం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఇటువంటి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని తెలిపారు. ఇప్పటికే పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలను ఈ కార్యక్రమానికి ముస్తాబు చేయడం జరిగిందన్నారు. అలాగే ఈ ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులకు వసతి భోజన సదుపాయాలపై బిజిఆర్ ఉన్నత పాఠశాల, బ్రేస్టార్ పాఠశాలను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిదులు, విద్యావేత్తలు, ప్రతిఒక్కరు సహాయ సహకారాలు అందించి రాష్ట్రంలోనే మంచిపేరు సాధించాలని తెలిపారు. సమావేశంలో డిసిఇబి సెక్రెటరీ ప్రతాప్‌రెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ఆనంద్, డిఎస్‌ఓ భాస్కర్,పాపన్న, అంపయ్య, తిమ్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నరసింహులు, మీడియా కమిటి సభ్యులు జగపతిరెడ్డి, రవిందర్,భీమేశ్వరరెడ్డి, ఈశ్వర్, లక్ష్మిరెడ్డిలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న
జిల్లా విద్యాశాఖ అధికారి మహమ్మద్ సిరాజుద్దిన్

## మంత్రిని సన్మానించిన టంకరి శివప్రసాద్

**మహబూబ్‌నగర్, నవంబరు 29 ప్రభాతవార్త :** రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు టంకరి శివప్రసాద్ యాదవ్‌ను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్‌ను మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను
సన్మానిస్తున్న టంకరి శివప్రసాద్ యాదవ్

## నేడు మండలానికి మంత్రి రాక..

**శ్రీరంగాపురం,నవంబర్ 29 ప్రభాతవార్త:** మండలంలోని నాగసానిపల్లి గ్రామంలో ఈరోజు సాయంత్రం 6గంటలకు పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పర్యటించి రాత్రికి గ్రామంలోనే బస చేస్తారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి సమస్యలు ఉన్నా మంత్రి దృష్టికి తీసుకురావచ్చునని సమస్యలు తెలుసుకునేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, కావునా మండంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి మంత్రి ఎల్లవేళలా మనకు సహాయ సహకారం అందిస్తున్నారని ఎలాంటి విషయాలనైనా పల్లెనిద్ర కార్యక్రమంలో చర్చించుకోవచ్చునని గ్రామ సర్పంచ్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు.

## తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న
## గ్రంథాలయ ఛైర్మన్ రామన్‌గౌడ్

**మల్దకల్,నవంబరు 29 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని వెలసిన శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని మంగళవారం జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రామన్‌గౌడ్ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణ మండపంలో నిర్వహించిన శ్రీ మల్దకట్టయ్య శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు.


గ్రంథాలయ ఛైర్మన్ రామన్‌గౌడ్‌ను
సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**వంగూరు, నవంబర్ 29, ప్రభాతవార్త:** వంగూరు మండల పరిధిలోని పోతారెడ్డిపల్లి గ్రామంలో రూ.25లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల పనులను సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను అభివృద్ధి పరిచి ప్రజలను చైతన్యవంతులను చేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగం జానకిరాంరెడ్డి, రాముడు, రమేష్, సుధాకర్, వెంకటయ్య, నరేష్‌యాదవ్, కృష్ణయ్య, అర్జున్‌రావు, బాబు, రాజు తదితరులు ఉన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

## టిఎస్ యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**మహ్మదాబాద్,నవంబరు 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా నాయకులు వెంకటేష్, రవికుమార్,ఎండి సలీం, తిరుపతమ్మ, వేణుగోపాల్‌వర్మ, సీనియర్ నాయకులు సత్యనారాయణ సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వెంకటయ్య, ప్రధాన కార్య దర్శిగా సాయన్న, ఉపాధ్యక్షులుగా డి.శివకుమార్, గౌరమ్మ, కోశాధికారిగా సురేష్, కార్యదర్శులుగా దస్తయ్య, వెంకటేష్, మహా లక్ష్మి, లక్ష్మణ్, కమిటి కార్యవర్గ సభ్యులుగా శంకర్, వేణుగోపా ల్‌వర్మ, వరలక్ష్మి, మహేశ్వరి, నాగరాణి, అలాగే వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ఇంఛార్జిగా కురుమయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎస్ రద్దు చేయాలని అలాగే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని బదిలీలు చేపట్టి పదో న్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏకగ్రీవంగా మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు యుటిఎఫ్ నాయకులు అందరికి కృతజ్ఞతలు తెలుపుతూ అలాగే సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఉపాధ్యాయుల సమస్యలపై ఎప్పటికప్పుడూ పోరాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.


నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న దృశ్యం

# మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి



మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట,నవంబరు 29 ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని స్థానిక పూలే చౌరస్తాలో నిర్వహించారు. కార్యక్రమానికి పూలే, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు, అడ్వకేట్ డి. దత్తాత్రేయ అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే అంటరాని వెలివాడలకు అక్షరమాల వేసిన ఉద్యమకారుడు అన్నారు. దేశంలోని ప్రజలందరికి విద్యనందించాలని పోరాటం చేశాడని కొనియాడారు. నేడు విద్యను మార్కెట్లో పెట్టి ప్రభుత్వాలు అమ్ముకుంటున్నాయి,కాని పూలే ఆనాడే ఉచిత విద్యనందించారన్నారు. పూలే ఆశయాలు కొనసాగించడం అంటే దేశంలో ప్రజలందరికి ఉచిత, నాణ్యమైన విద్యను అందించినప్పుడే పూలే ఆశయాలు కొనసాగించిన వారమవు తామని అన్నారు. దేశంలో కులం అనే పదం పోవాలని అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి నడిపించారన్నారు. కానీ నేటికి కుల ఉన్మాద హత్యలు, అంటరానితనం, మహిళల పట్ల వివక్షత కొనసాగుతుందన్నారు. ఇలాంటి దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే పూలేకు మనమిచ్చే నిజమైన నివాళి అని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మొగులప్ప, బిసి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులుగౌడ్, నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు ఎన్‌బి నాయుడు, హనుమంతు, రజకసంఘం నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు ముదిరాజ్, అర్జున్ రాజ్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు కొలిమి రాములు, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర, అంబేద్కర్ సంఘం నాయకులు పోలప్ప, పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేష్, శ్రీనివాస్, నిరంజన్, ఎమ్మార్పీఎస్ నాయకులు భీమేష్, కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, న్యాయవాది సురెందర్, మాజీ కౌన్సిలర్ కర్రెం హన్మంతు, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగ కావడి మహోత్సం



కావడిలో పాలు మోస్తున్న అయ్యప్ప భక్తులు

**కొత్తకోట,నవంబర్ 29 ప్రభాతవార్త:** పట్టణంలోని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సుబ్రమణ్య షష్టి పురస్కరించుకొని గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో కావడి మహోత్సవం నిర్వహించారు. పట్టణంలోని అంబ భవాని ఆలయం నుండి అయ్యప్ప స్వాములు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని స్వయం సిద్దిగా చేసుకున్న కావడితో శోభయాత్ర బయలుదేరి మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి అయ్యప్ప సేవా సమితి అన్నదాన కేంద్రం వరకు శోభయాత్ర భజ భజంత్రిలతో వెళ్లి సుబ్రమణ్య స్వామి వారికి తీసుకెళ్లిన పాలు, బెల్లంతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. కావడి మహోత్సవం తమిళనాడు రత్నం ప్రాంతంలో ఎంతో భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారనొ గురుస్వామి గోపాలస్వామి తెలిపారు. మార్గశిర మాసం షష్టి రోజు సుబ్రమణ్య స్వామి జననం జరిగిందని తెలిపారు.

# ఇంఛార్జ్ జెడ్పీచైర్మన్‌కు మంత్రుల అభినందనలు



ఇంఛార్జ్ జెడ్పీచైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌ను అభినందిస్తున్న మంత్రి కేటీఆర్



ఇంఛార్జ్ జెడ్పీచైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌ను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 29, ప్రభాతవార్త: నూతనంగా జెడ్పీ చైర్మన్‌గా ఎన్నిక కాబడిన చారకొండ మండల జెడ్పీటీసీ ఠాకూర్ బాలాజీ సింగ్‌కు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్‌లు అభినందనలు అందించారు. జెడ్పీచైర్మన్‌గా నియమించడంతో ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర మంత్రులు, సహకరించిన ఎమ్మెల్యేకు, నాయకులకు ఠాకూర్ బాలాజీసింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో జెడ్పీచైర్మన్ పదవి అప్పగించినందుకు జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్యకర్తలకు,నాయకులకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ అధికారులతో సమన్వయం ఏర్పరుచుకొని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రైతు, ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వాటిని తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, నవంబర్29, ప్రభాతవార్త:** యువత తాము ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి మున్సిపాలిటిలోని 20వ వార్డులోని యువకులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి క్రికెట్ కిట్‌ను క్రీడాకారులకు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆటలపై పట్టు సాధించాలన్నారు. యువత తమ ఖాళీ సమయాన్ని క్రీడలపై పట్టు సాధించేం దుకు ఉపయోగించాలన్నారు. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేం దర్‌రెడ్డి యువకులుక్రీడల్లో రాణించాలనేఉద్ధేశ్యంతో క్రీడాకారులను ప్రోత్స హిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తర్నికల్‌మాజీ సర్పంచ్ పవన్ కుమార్‌రెడ్డి, పల్గు తాండ ఉపసర్పంచ్ రమేష్‌నాయక్, నాయకులు బాల్‌రెడ్డి, గోళి రంజిత్‌రెడ్డి, యువకులు చంద్రశేఖర్,లోకేష్, అల్లాజీ, మోహన్, వినయ్, అరవింద్, హరీష్, జితేందర్, రిషి, యాదగిరి, విజయ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, ఆవ గణేష్, కొండల్‌యాదవ్, జగన్, హసన్, షఫీ, శేఖర్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వేరుశనగ పంటల పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

**వెల్దండ, నవంబర్29, ప్రభాతవార్త:** మండలంలో వేరుశనగ సాగు చేసిన పంట 40 రోజుల్లో ఉందని, చీడ పీడ పురుగుల నివారణకు రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి పి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని రాచూర్ గ్రామంలో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను డివిజన్ సాంకేతిక వ్యవసాయాధికారి పల్లవి, మండల ఏఓ మంజులతో కలిసి పి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలు అధిక దిగుబడి పొందుటకు పంట విత్తిన 40 రోజుల తర్వాత ఎకరానికి 200 కేజీల జిప్సంను మొక్క మొగలుదగ్గర వేయాలన్నారు. పంటలో పొగాకు లద్దె పురుగు నివారణ, ఆకుముడుత పురుగు నివారణకు ఇండాక్సికార్+న్యూ వాల్యూరాన్(ఫ్లీథోరా)అనే మందును 15 మిల్లీ లీటర్లు 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ బినతి, రైతులు మహేష్‌గౌడ్, గుత్తి బాలయ్య, గుత్తి రామకృష్ణ, శ్రీశైలం, కృష్ణయ్య, శివశంకర్, సుధీర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్29, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన గుర్రం కళమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పరామర్శించి ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.3వేల ఆర్థిక సహాయాన్ని మృతురాలి కుటుంబానికిఅందించారు. కార్యక్రమంలో కొప్పు శేఖర్, పోలే అనిల్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## 2న మండల సర్వసభ్య సమావేశం

**ఇటిక్యాల,నవంబరు 29 ప్రభాతవార్త :** డిసెంబర్ 2వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఉదయం 11 గం.లకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపిపి స్నేహ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ రాఘవ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జడ్పీ చైర్మన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం, జడ్పీటిసి హనుమంతురెడ్డి హాజరు కానున్నారని ఈ సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరు కావాలని ఎంపిడిఓ రాఘవ తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

**జిల్లా సహాయ బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి**



వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డి

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 29 ప్రభాతవార్త:** ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని జిల్లా సహాయ బీజీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వం బీసీ బాలుర కళాశాల వసతి గృహం, ప్రభుత్వ బీసీ బాలుర ఏ,బి వసతి గృహాలలో విద్యార్థులకు కదుకుంట్ల పీహెచ్‌సీ డా.పి.రాకేష్ రెడ్డి, వైద్య సిబ్బంది చేత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని వసతిగృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు జ్వరం, మలేరియా,డెంగు వంటి లక్షణాలు ఏమైనా కనబడితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని వసతిగృహ సంక్షేమ అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వసతి గృహ చుట్టుపక్కల ఆవరణ వంటశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్కర్స్, విద్యార్థులకు కోరారు. ప్రతి ఒక్క విద్యార్థి కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.రాకేష్ రెడ్డి, వైద్య సిబ్బంది, వసతి గృహ సంక్షేమ అధికారి ఎస్.ఆంజనేయులు, వసతిగృహ సిబ్బంది, ఎండి బాసిత్, దేవరాజ్, ఎండి సలాం, శకుంతలమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జీడిపల్లిలో ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి

**కల్వకుర్తి, నవంబర్29, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామంలో ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. గ్రామంలో త్వరలో ఈదమ్మ దేవాలయానికి రూ.3 లక్షలు, ఎల్లమ్మ దేవాలయానికి రూ.2లక్షలు, అంబేద్కర్ విగ్రహానికి రైలింగ్, టైల్స్,స్వామి వివేకానంద విగ్రహానికి రైలింగ్,జీడిపల్లి తాండలో తుల్జ భవాని దేవాలయానికి రూ.2లక్షలు, తాండలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. హామీలో భాగంగా వరప్రసాద్‌రెడ్డి జీడిపల్లి గ్రామంలో, తాండలో పర్యటించి త్వరితగతిన పనులను నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్పన కృష్ణయ్య, ఉప సర్పంచ్ ఖాజా, జీడిపల్లి తాండ ఉప సర్పంచ్ సభావట్ సరోజ, శ్రీనునాయక్,వార్డు సభ్యులు రవీందర్‌నాయక్, సంతోష, గ్రామస్తులు శంకర్, వెంకటయ్య, వాల్యానాయక్, మహేష్,ఎడ్లకృష్ణయ్య,శివ,బాలకృష్ణ, పరుశరాములు, రామస్వామి, లాలయ్య, ఏకాంబరం, పోల శ్రీశైలం, ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, రాఘవేందర్‌యాదవ్, మల్లయ్య, గణేష్, హసన్, షఫీ, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

# సీఎం సభను విజయవంతం చేద్దాం..!

**● నేడు పెద్దమందడిలో టీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ● మండల తెరాస అధ్యక్షులు ఎం.వేణుయాదవ్**

**పెద్దమందడి,నవంబర్ 29 ప్రభాతవార్త:** డిసెంబర్ 4న మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవం చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్నారని మండల తెరాస అధ్యక్షులు ఎం.వేణుయాదవ్ తెలిపారు. సీఎం పర్యటనను, బహిరంగ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయశాక మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఉదయం 10గంటలకు టీఆర్ఎస్ ముఖ్యకార్యల సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆయనఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎంపీపీ మేఘారెడ్డి, జిల్లా రైతు బంధు అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, జడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్‌విండో అధ్య క్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షులు రాజప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రఘు ప్రసాద్, జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం డైరెక్టర్ నాగేంద్రం యాదవ్, మాజీ పీఎసీఎస్ చైర్మెన్ విట్టా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మణ్యపురెడ్డి, పీఎసీఎస్ వైస్ చైర్మెన్ కుమార్‌యాదవ్ హాజర వుతారు. అన్ని గ్రామాల ముఖ్యకార్యకర్తలుహాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# తడి చెత్త, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన



తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కొత్తకోట,నవంబర్ 29 ప్రభాతవార్త:** తడి చెత్తను, పొడి చెత్తనే వేర్వేరు చేయాలని పట్టణంలోని 1,2,3,4 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని మంగళవారం కల్పించారు. ఆయా వార్డుల్లో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ మున్సిపాలటీ అందించిన చెత్త బుట్టలోనే చెత్తను వేయాలని, ప్రతి నిత్యం తిరుగుతున్న మున్సిపల్ ఆటో సిబ్బందికి అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని అన్నారు. కాల్వల్లో చెత్తను వేయవద్దని, రెండు చెత్త బుట్టలను ఉపయోగించి వాటిని వేర్వేరు చేయూలని నూతనంగా నిర్మిస్తున్న బీఆర్ఎస్ సెంటర్ కు పంపించి వాటి రూపురేఖలు మార్చి పంటలకు కావాల్సిన ఎరువులుగా మారుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రమేష్‌నాయక్, కౌన్సిలర్లు కొండారెడ్డి, రాములు యాదవ్, లావణ్య, జగదీశ్వర్, తదితరు పాల్గొన్నారు.



## బహ్మోత్సవాలలో కవులకు సన్మానం

**మల్దకల్,నవంబరు 29 ప్రభాతవార్త :** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం విద్వత్ గద్వాలగా పేరుగాంచిన నడిగడ్డ కవులకు మల్దకల్ శ్రీ తిమప్పస్వామి దేవాలయంలో 30 మంది కవులకు దేవాలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, మల్దకల్ గ్రామానికి చెందిన వారణాసి నాగేశ్వరచారి స్వామి వారిపై రచించిన మొల్ల కంటయ్య శతకం అని పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవులు తమ కవిత్వాన్ని వినిపించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, లింగం, కవులు బస్వరాజ్, రామ్మోహన్‌రావు, బాలస్వామి, డా.వీరచారి, పవన్‌కుమార్,దోలుబుచ్చన్న,రాధకృష్ణమూర్తి,గురుబ్రమ్మచారి,అనిమిరెడ్డి,రాజేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన పాఠశాల విద్యార్థులు



ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన పాఠశాల విద్యార్థులు

**ఉప్పునుంతల,నవంబరు 29 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమికోన్నత బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులు మంగళవారం ప్రభుత్వ కార్యాలయాల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. పాఠ్యాంశాల్లో ఉన్నఅంశాల్లో భాగంగా పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం, ఎమ్మార్సీ, వ్యవసాయ కార్యాలయం, వైద్యశాలను సందర్శించారు.ఈ సందర్శనలో విద్యార్థులకు పలుఅంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు,ఎఎస్సై అంజయ్య,ఆపాఠశాల హెచ్ఎంలు కట్టనర్సింహారెడ్డి, లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు శేఖర్ ముదిరాజ్, వెంకటేష్, బాలమణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో చిన్నారి మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చిన్నారి నిహారిక



నిహారిక (ఫైల్)

**అయిజ,నవంబరు 29 ప్రభాతవార్త:** మండలపరిధిలోని ఈడిగోనిపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో బాలిక మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బస్వరాజు, జయంతిల కూతురు నిహారిక (10) నాలుగో తరగతి చదువుతుంది. ఇంట్లో మొబైల్ ఫోన్ ఛార్జింగ్ తీస్తూ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.గ్రామంలోవిషాద ఛాయలు అలుముకున్నాయి.గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్తులు సరిగా పని చేయకపోవడంతో ఈ సంఘటన జరిగిందన్నారు.గత 20 రోజుల నుండి కొన్ని ఇండ్లకు విద్యుత్ పొసై ఫ్యాన్లు, టివిలు కాలిపోవడం జరిగిందని చెప్పారు. విషయాన్ని విద్యుత్ అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. ఇది ముమ్మాటికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంవల్లే చిన్నారి నిహారికమృతి చెందిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



బీచుపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఐకెపి ఎపిఎం సర్పంచ్

**ఇటిక్యాల,నవంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం రైతులు ఖరీఫ్ సీజన్‌లో పండించిన వరిని కొనుగోలు చేసేందుకు గ్రామాలలోనే ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకెపి ఎపిఎం శోభారాణి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బీచుపల్లి గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఐకెపి ఎపిఎం శోభారాణి, సర్పంచ్ నరసమ్మ, వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులు పండించిన వరిని గ్రామాలలోనే కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేసిందని అలాగే వారికి మొదటి రకం రూ. 2060, రెండవ రకం రూ.2040కు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు అలాగే 17 శాతం తేమ ఉండేలారైతులు చూసుకుని వరికొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ ఏఈఓ మౌనిక, గ్రామ నాయకులు సుధాకర్‌రెడ్డి,కొండపేట నరసింహులు, గ్రామ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అంబరామలింగేశ్వరస్వామి సన్నిధికి చేరుకున్న రథయాత్ర



ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

**వెల్దండ, నవంబర్ 29, ప్రభాతవార్త:** తిరుమల కొండపై అధ్యాత్మిక మూర్తి అన్నమయ్య గృహాన్ని, ఆంజనేయస్వామి విగ్రహాన్ని పున: ప్రతిష్ట చేయాలని అన్నమయ్య గృహసాధన సమితి చైతన్య రథయాత్రను నిర్వహిస్తున్నారు. మంగళవారం చైతన్య రథయాత్ర సమితి జాతీయ అధ్యక్షులు విజయశంకం స్వామి, జైభారత్ జ్వాల జాతీయ కార్యదర్శి ఖాదీజ్ఞాసిలను గుండాల అంబ రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2003వ సంవత్సరంలో తిరుమల కొండపై కూల్చిన అన్నమయ్య గృహాన్ని, ఆంజనేయస్వామి విగ్రహాన్ని యథాస్థానంలో నిర్మించాలని టీటీడీ బోర్డును డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జాతీయ కార్యదర్శులు లోక్‌నాథ్, సత్యనారాయణగోల, జయిభారతి రాష్ట్ర నాయకులు రాఘవదాస్,లక్ష్మణ్, బీసీ పోరాట వేధికరాష్ట్ర ఉపాధ్యక్షులు జూపల్లి రాములు, జిల్లా అధ్యక్షులు డి.శ్రీరాములు, ఉపాధ్యక్షులు యాసిన్, నసీర్, శ్రీనులతో పాటు తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, నవంబర్ 29, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన కడారి గణేష్‌యాదవ్ ఇటీవల ఆర్టీసీ బస్ డీకొని మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని అచల భారత యాదవమహాసభ గ్రేటర్ యువజన విభాగం విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని గ్రామ యాదవ సంఘం సభ్యులు మృతుని భార్యకు అందించారు. మృతుని కుటుంబాన్ని యాదవ మహాసభ అన్ని విధాల అండగా నిలుస్తుందన్నారు.కార్యక్రమంలోయాదవసోదరులువీరేందర్‌యాదవ్,వసంతపు రవీందర్ యాదవ్, అంజియాదవ్, గణేష్‌యాదవ్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

# రుణాలు సకాలంలో అందించాలి

- స్వయం ఉపాధి పథకాల కింద ఎంపికయ్యే లబ్ధిదారులకు రుణాలను వెంటనే మంజూరు చేయాలి
- ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకు అధికారులు సకాలంలో రుణాలు అందించాలి
- వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్


వార్షిక ప్రణాళిక బ్రోచర్ ను విడుదల చేస్తున్న జడ్పీ చైర్మన్, జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్, అధికారులు

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 29 ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా బ్యాంక్ అధికారులు రుణాలను సకాలంలో అందించాలని జిల్లా పరిషత్ చైర్మెన్ ఆర్.లోక్‌నాథ్ రెడ్డి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో డీసీసీ, డీఎల్ఆర్సీ 2022-23 సంవత్సరం త్రైమాసిక బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వయం ఉపాధి కింత ఎంపిక చేసిన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందజేయాలని ఆయన అన్నారు. జిల్లాలోని ఎస్.హెచ్.జి సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కింద మంజూరైన రుణాలను వెంటనే అందించాలని ఆయన తెలిపారు. సీఎస్టీ లబ్ధిదారుల స్వయం ఉపాధికి బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించి రుణాలు అందజేయాలని ఆయన అన్నారు. వ్యవసాయ ప్రాధాన్యతా రంగం, ఆర్థిక మద్దతు పథకాలు అమలులో ప్రభుత్వం కీలకపాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. సమాజంలో సమాన అవకాశాలు కల్పించేందుకు, రుణాల కోసం నిరుద్యోగులు, రైతులు ప్రాధాన్యతను సంతరించుకున్నారని ఆయన తెలిపారు. విద్యా రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాలను బ్యాంకులు, లైన్ డిపార్ట్‌మెంట్లు పెండింగ్ లో లేకుండా చూడాలని ఆయన సూచించారు. అర్హత గల ఎస్.సీ, ఎస్ టీ కార్పోరేషన్ సబ్సిడీ రుణాలను లబ్ధిదారులకు వెంటనే మంజూరు చేయాలని ఆయన తెలిపారు. నైపుణ్యం ఉన్న అర్హత గల అభ్యర్థులను గుర్తించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆయన కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా అందించే రుణాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వ రుణాలను సకాలంలో అందజేయాలని ఆయన తెలిపారు. వివిధ పథకాల ద్వారా లబ్ధిదారులకు 100% రుణాలు అందించాలని బ్యాంకర్లకు ఆయన సూచించారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు సకాలంలో బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడు బ్యాంకు మేనేజర్ అమూల్ పవార్, నాబార్డ్ ఏజీఎం, డీఆర్డీఓ నరసింహులు, బ్యాంకు మేనేజర్లు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన జిల్లాలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు

## ఆలయాభివృద్ధికి కృషి

- ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, నవంబర్ 29, ప్రభాతవార్త:** నల్లమల్ల ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రభుత్వ విప్, అచ్చం పేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలను కల్పించేందుకు దేవాలయ ప్రాంగణంలో ఏర్పడిన సమస్యలను తమదృష్టికి తీసుకొని రావాలని ఆయన సూచించారు. బ్రహ్మోత్సవాల సమయంలో వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్, అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం రెండవ సారిగా ఆలయ చైర్మన్‌గా ఎన్నిక కాబడిన డాక్టర్ విష్ణుమూర్తి, కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

## మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

**నారాయణపేట,నవంబరు 29 ప్రభాతవార్త:** మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో లింగాల్‌చెడ్ వాగునుండి మద్దూరుకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను మద్దూరు పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తలించారు. చంద్రశేఖర్ తండ్రి బాలప్ప ట్రాక్టర్ నం. టిఎస్ 06 యుబి 8286, సాయిలు తండ్రి గజలప్ప టిఎస్ 06 యుడి 4327, విస్లావత్ లచ్చా నాయక్ తండ్రి నారి అన్నయ్య పిల్లిగుండ్ల తండా దోరేపల్లి టిఎస్ 06 యుబి 8778 లను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా మద్దూరు ఎస్సై సతీష్ మాట్లాడుతూ ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పరస్పర సౌభ్రాతృత్వం, మతపరమైన ఐక్యత భారతదేశానికి ప్రత్యేకతలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సదస్సుకు మహబూబ్‌నగర్ ఎంపి శ్రీనివాస్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి, ఇంతియాజన ఇసాక్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ తెలంగాణ, మౌలానా సయ్యద్ ముస్తఫా ఖాద్రి, కర్ణాటక సయ్యద్‌షా అబ్దుల్ రజాక్ ఖాద్రి, మహబూబ్‌నగర్ సయ్యద్ జలాల్ హుస్సేని షమీం, కోయిల్‌కొండ మౌలానా నయీం కౌసర్, రషాదీ, మహబూబ్‌నగర్ మౌలానా అబ్దుల్ నాసిర్, మజాహిరి నారాయణపేట జిల్లా ఆర్డీఓ అధికారి వీరస్వామి, గోవింద, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రాజస్వామి పాల్గొన్నారు. అఖిల భారత సర్వమత సదస్సును ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో భిన్నమతాల ప్రజలు సోదరభావంతో, ఐక్యతతో జీవిస్తున్నారని, ఇదే భారతదేశ లక్షణమని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరు ఒకరి మతాన్ని గౌరవించుకోవాలని ఇలాంటి సదస్సుల ద్వారా హిందూ, ముస్లింల ఐక్యత పెంపొందుతుందని వక్తలు పేర్కొన్నారు. వక్తలు మాట్లాడుతూ భారతదేశంలో వివిధ మతాలకు చెందిన వారు నివసిస్తున్నారన్నారు. ఇది భారతదేశం గుర్తింపు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన వక్తలు సయ్యద్ షా జలాల్ హుస్సేని, అష్రఫీ జలలి, సజ్జదా షా జలాల్ హుస్సేనీ, అష్రఫీజలాలీ సజ్జదా నాషిన్ బర్గా ఖతాలియా, కొల్లంపల్లిని అభినందిస్తూ సదస్సును నిర్వహిస్తూ ప్రజలకు మంచి సందేశాన్ని అందిస్తున్నారని అన్నారు. ఎవరి నాలుక, చేతుల నుంచి ఇతరులకు భద్రత ఉంటుందో ఆ మతమే ఇస్లాం అని వక్తలు తెలిపారు. చివరికి సజ్జద్ బర్గా ఖతాలియా కొల్లంపల్లి వారసుడు మౌలానాసయ్యద్ షా, జలాల్ హుస్సేనీ, అష్రఫీ జలాలీ చేతులమీదుగా అతిథులకు స్వర్ణమయం చేయనున్నారు. మదర్సా దారుల్ ఉలూమ్ అష్రఫియా కొల్లంపల్లిలో పేద విద్యార్థులకు బట్టల పంపిణీ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ ఎంపి, ఎమ్మెల్యే నారాయణపేట ఎస్. రాజేంద్రరెడ్డి తదితరులు నిర్వహించారు. ఈసదస్సును అబ్దుల్ సలీం అడ్వకేట్ నిర్వహించారు. కార్యక్రమంలో అమీరొద్దిన్ అడ్వకేట్, కౌన్సిలర్ మహ్మద్ షఫి చంద్, జిల్లా సహాయ సభ్యుడు మహ్మద్ తాజుద్దిన్, సర్ఫరాజ్ హుస్సేన్ అన్సారి, ఫజల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. సయ్యద్ ఫైజ్ పాషా ముగింపు మాటలతో సదస్సు ముగిసింది.

## అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న డిసిసిబి చైర్మన్



**గండీడ్,నవంబరు 29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో శ్రీనివాస్‌రెడ్డి స్వామి స్వగృహంలో మహాపడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కుల్కచర్ల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడిపూజ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పడిపూజ కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు భక్తి భావంతో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమానికి గండీడ్ వైస్ ఎంపిపి ఈశ్వరయ్యగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కుల్కచర్ల పిఏసిఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, చౌడాపూర్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, కిరణ్‌కుమార్, రామ్‌లాల్, మొగులయ్య, జోగుకృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

## పొన్నకల్ అభివృద్ధికి హోంమంత్రి కోటాలో రూ. 11 లక్షలు మంజూరు

**దేవరకద్ర,నవంబరు 29 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మం డలం పొన్నకల్ గ్రామ అభివృద్ధి కొరకు దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో పొన్నకల్ గ్రామ అభివృద్ధి కొరకు తెలంగాణ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తక్షణమే గుర్తించి పొన్నకల్ గ్రామ అభివృద్ధి కొరకు ఎమ్మెల్సీ కోటనుండి రూ.11 లక్షలు మంజూరు చేశారు. దీంతో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## స్వయం ఉపాధి రుణాలు లక్ష్యం మేరకు గ్రౌండింగ్ చేయాలి

- బ్యాంకర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట,నవంబరు 29 ప్రభాతవార్త:** జిల్లాలో విద్యా, గృహ రుణాలతో పాటు స్వయం ఉపాధి రుణాలు లక్ష్యం మేరకు గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమన్వయ, సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఆయా బ్యాంకుల పనితీరు, ఇచ్చిన రుణాలు, మొండి బకాయిల వివరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకర్లు రుణాలు ఇవ్వడంలో లక్ష్యం సాధించలేకపోతున్నారని అందుకు కారణాలు ఏంటని ప్రశ్నించారు. ముద్ర రుణాలు, ప్రధానమంత్రి స్వనిధి, పిఎంఈజిపి వంటి సబ్సిడి రుణాలు ఆశించిన స్థాయిలో గ్రౌండింగ్ కావడం లేదన్నారు. వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి వారికి రుణం ఇవ్వడమా లేక తిరస్క రించడమా అనేది త్వరగా జరగాలని అంతే తప్ప బ్యాంకు చుట్టు తిప్పుకోవద్దని సూచించారు. డైరీ, పౌల్ట్రీ, ఫోర్టిఫైడ్ రైస్ వంటి స్వయం ఉపాధికి బ్యాంకర్లు, సంబంధిత జిల్లా అధికారుల సమన్వయంతో పనిచేసి నిరుద్యోగ యువతకు రుణాలు ఇప్పించి ఉపాధి కల్పించాలని సూచించారు. గృహ రుణాలు, విద్యారు ణాలు చాలా తక్కువ ఉన్నాయని ఇందుకు కారణాలు ఏంటని ప్రశ్నించారు. ఇందుకు ఎస్‌బిఐ అధికారి స్పందిస్తూ చిన్నచిన్న క్రాప్ లోన్‌లు సకాలంలో చెల్లించకపోవడం వల్లవాళ్ల సిబిల్ సోర్ తగ్గిపోతుందని తద్వారా పెద్ద రుణాలు పొందలేక పోతున్నారని సమస్యను కలెక్టర్‌కు వివరించారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాలకు రుణాలు గ్రౌండింగ్ అవుతున్నప్పటికి పట్టణ స్థాయిలోని మహిళా సంఘాలకు రుణాలు గ్రౌండింగ్ చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాలకు ఈ సంవత్సరం రుణాలు ఇప్పటివరకు 160 కోట్లు గ్రౌండింగ్ అయ్యాయని రాబోయే నాలుగు నెలల్లో ఇంకా 130 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. కొన్ని బ్యాంకులు మహిళా సం ఘాల రుణాలు 10 శాతం తమ బ్యాంకులో సెక్యూరిటీ డిపాజిట్ లేదా జమఖాతాలో ఉంచుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇది నిబంధనలకు విరుద్దం అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ 10 శాతం రుణం తమ వద్ద డిపాజిట్ చేసుకోవద్దని బ్యాంకర్లను ఆదేశించారు. అదేవిధంగా మహిళా సంఘాల ప్రతినిధులు బ్యాంకుకు వచ్చి రోజంతా బ్యాంకు వద్ద కూర్చోబెట్టుకోకుండా వారికి ఒక నిర్దిష్ట సమయం కేటాయించి ఆ సమయంలోనే వాళ్ల దరఖాస్తులు, సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లను సూచించారు. మహబూబ్‌నగర్‌లో ఉన్న ఆర్ఎస్ఈటిఐలో జిల్లా నుండి నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, గ్రామీణాభివృద్ధి శాఖ పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో నాబార్డు అధికారి శ్రీనివాస్, జిల్లా అధికారులు, లీడ్‌బ్యాంక్ మేనేజర్, ఆర్బీఐ అధికారి, ఎస్‌బిఐ అధికారి, బ్యాంకర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్


సమావేశానికి హాజరైన బ్యాంకు అధికారులు

## టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలి

◆దళిత బంధు పథకం దేశానికి ఆదర్శనీయం : ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**లింగాల,నవంబరు 29 ప్రభాతవార్త:** టిఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని ప్రభుత్వవిప్, గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలో గట్టు కురుమయ్యకు దళితబంధు కింద మంజూరు అయిన టెంట్ హౌజ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాడపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా దళిత బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దళితులఅభ్యున్నతికి అంబేద్కర్ కృషివల్ల సాధ్యమైందని అన్నారు. లబ్ధిదారుడి పెట్టుబడి రూపాయి లేకుండా దళిత బంధు పథకంద్వారా వందశాతం ప్రభుత్వ నిధులతో పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రజల కోసం ప్రాణంపెట్టి పనిచేసే ఏకైక నాయకుడు కెసిఆర్ అన్నారు. మిగిలిన దళితులకు త్వరలోనే నియోజకవర్గానికి ఎంచుకున్న యూనిట్లను అందజేస్తామని అన్నారు. గ్రామాలలో నాయకులు, కార్యకర్తలు సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మాజీ జడ్పీటిసి మాకం తిరుపతయ్య, టిఆర్ఎస్ జిల్లా నాయకులు కేటి తిరుపతయ్య, వైస్ చైర్మన్ వెంకటగిరి, సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, పర్వతాలు, శేషయ్య, సింగిల్ విండో డైరెక్టర్లు బాలరాజుగౌడ్, శంకర్‌నాయక్, ఆల్లె శ్రీనివాసులు, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దళిత బంధు కింద మంజూరైన టెంట్ హౌజ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## కొత్త మండలంగా కౌకుంట్ల..!

- హాజరుకానున్న మంత్రి, ఎంపి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే
- ముందుగా తహసీల్దార్, ఎంఈఓ, ఎంపీఓ కార్యాలయాల ప్రారంభం
- దేవరకద్రలో బిసి గురుకుల బాలుర డిగ్రీ కళాశాల ప్రారంభం

**దేవరకద్ర,నవంబరు 29 ప్రభాతవార్త :** కొత్తగా ఏర్పడిన దేవరకద్ర మండలంలోని కౌకుంట్ల కొత్త మండలాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి జిల్లా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఉదయం 10 గం.లకు దేవరకద్రలోని మహాత్మాగాంధి జ్యోతిభాపూలే బిసి గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను వారు ప్రారంభిస్తారు. అనంతరం అక్కడె కౌకుంట్ల మండలానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు వారు అందజేస్తారు. ఆ తరువాత కౌకుంట్ల కొత్త మండలానికి వెళ్లిఅక్కడ ముందుగా తహసిల్దార్ కార్యాలయాన్ని మధ్యాహ్నం 12 గం.లకు ప్రారంభిస్తారు. 12.30 గం.లకు ఎంఈఓ కార్యాలయాన్ని వారు ప్రారంభిస్తారు. అలాగే మధ్యాహ్నం 1 గం.లకు ఎంపీఓ కార్యాలయాన్ని కూడావారు ప్రారంభిస్తారు.కావున ఈ కార్యక్రమానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, టిఆర్ఎస్ పారీన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హజరు కావాలని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహారెడ్డి కోరారు.

***కౌకుంట్ల వాసుల కల సహకారం...***

కౌకుంట్ల కొత్త మండలాన్ని ప్రారంభిస్తుండడంతో ఆ గ్రామ వాసుల కల సాకారం కానుంది. కౌకుంట్లను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని గతకొన్ని రోజులుగా ఆ గ్రామస్తులు కోరుతున్నారు. అయితే ఈ విషయంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమస్యను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి కౌకుంట్ల కొత్త మండలంగా ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేసి సఫలీకృతులయ్యారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే కొత్త మండలాల జాబితాలోకి దేవరకద్ర మండలంలోని కౌకుంట్ల కూడా చేరింది. దీంతో ఎట్టకేలకు కౌకుంట్ల కొత్త మండలంగా ఏర్పాటు కాబోతుంది. దీంతో ఆ గ్రామస్తులు సంతోషం వ్యక్తపరుస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యమంత్రితో పాటు మంత్రి, ఎంపి, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలకు వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


కొత్త మండలంగా ఏర్పాటు అవుతున్న కౌకుంట్ల